RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

వరంగల్ | గురువారం | పేజీలు : 4
సంపుటి : 3, సంచిక : 186 | జూన్ 19, 2025 | వెల : రూ.3-00

దినపత్రిక



పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

4లో..



## ఎమ్మెల్యే పదవికి అనర్హుడు కౌశిక్

- ప్రజా సంక్షేమమే మా ప్రభుత్వ విధానం
- కాంగ్రెస్ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్ చార్జి ప్రణవ్

**వేద న్యూస్, జమ్మికుంట:**

గెలిచిన 15 నెలల్లో కౌశిక్ రెడ్డి అనేక బెదిరింపులు,అరాచకాలు,అక్రమాలు చేసి హుజురాబాద్ పరువుతీస్తున్నాడనీ హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్ చార్జి వొడితల ప్రణవ్ తీవ్ర స్థాయిలో కౌశిక్ రెడ్డిపై మండిపడ్డారు.బుధవారం రోజున జమ్మికుంట పట్టణంలోని కొత్తపల్లిలో గల శ్రీభక్తఆంజనేయ స్వామి 33వ వార్షికోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు.అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ తప్పు చేసాడు కాబట్టే కౌశిక్ రెడ్డి భయపడి ముందస్తు బెయిల్ కు పోయాడని,గతంలో సన్నిహితంగా ఉన్న గ్రానైట్ వ్యాపారి కుటుంబ సభ్యులు ఏకంగా ఎమ్మెల్యేపై కేసు పెట్టడం అంటే కౌశిక్ రెడ్డి ఏ విధంగా అరాచకం చేశాడో అర్థం అవుతుందని అన్నారు.ఎన్నికల్లో గెలిపించికపోతే చస్త అని సెంటిమెంట్ తో గెలిచి ఇప్పుడు కేసు కొట్టివేయమని కోర్టుకు ఎక్కారని,న్యాయస్థానాలు ఎన్నిసార్లు మొట్టికాయలు వేసిన కౌశిక్ రెడ్డికి బుద్ధిరావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేసారు.ఇలాంటివి ఇప్పటికైనా మానుకోవాలని సూచించారు.

**కౌశిక్ రెడ్డి పిచ్చి బీఆర్ఎస్ నాయకులకు పట్టింది..**

బీఆర్ఎస్ నాయకురాలు కవిత చెప్పినట్లుగా పార్టీలో దయ్యాలు ఉన్నాయని ఆ దయ్యంలో కౌశిక్ రెడ్డి మొదటి వరసలో ఉంటారని,కౌశిక్ రెడ్డి పిచ్చి బీఆర్ఎస్ నాయకులకు పట్టిందనీ అందుకనే ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేసారు.కేటీఆర్ ఇంతకుముందు కొంచెం పద్ధతిగా మాట్లాడేవారని ఇప్పుడు కౌశిక్ రెడ్డి వెనక ఉండడం వల్ల ఆ పిచ్చి కేటీఆర్ కు పట్టినట్లుందని అని అన్నారు.సీఎం రేవంత్ రెడ్డి పై ఇంకోసారి ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే చూస్తూ ఊరుకోబోమనీ హెచ్చరించారు.ప్రజా సంక్షేమమే మా ప్రభుత్వ విధానమనిస్పష్టం చేశారు. కార్యక్రమంలో జమ్మికుంట మండల స్థాయి నాయకులు,సీనియర్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు

## మాది ఇన్నోవేటివ్ సర్కారు

- స్టూడెంట్స్‌కు స్కిల్స్ కోసమే వర్సిటీ
- జీఎస్ఈజీ సెంటర్ ప్రారంభోత్సవంలో సీఎం
- 2047 లోపు 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా తెలంగాణ: రేవంత్

**వేద న్యూస్, హైదరాబాద్ :**



డిజిటల్ భద్రత జీఎస్ఈసీ ప్రధాన లక్ష్యమని, గూగుల్ ఇన్నోవేటివ్ కంపెనీ, తమది ఇన్నోవేటివ్ ప్రభుత్వమని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. బుధవారం హైదరాబాద్‌లో గూగుల్ సేఫ్టీ ఇంజినీరింగ్ సెంటర్‌ను ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో కలిసి సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జీఎస్ఈసీ కేంద్రాన్ని ప్రారంభించడం గర్వకారణంగా ఉందని అన్నారు. ప్రపంచం మొత్తం డిజిటల్ యుగంగా మారుతుందని, డిజిటల్ సమాచారం భద్రంగా ఉంటే క్షేమంగా ఉన్నట్లేనని స్పష్టం చేశారు. ప్రస్తుత ప్రభుత్వంలోనే నూతన ఆవిష్కరణలు, విధానాలు తీసుకొచ్చామని, విద్యార్థులు సర్టిఫికెట్లు పొందుతున్నారు కానీ స్కిల్స్ లేవని అన్నారు. నైపుణ్యాలు పెంచేందుకు స్కిల్ వర్సిటీ ఏర్పాటు చేశామని చెప్పారు. ఉత్తమ పెట్టుబడులకు గమ్యస్థానంగా తెలంగాణ మారుతుందని తెలిపారు. 2035లోపు 1 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా తెలంగాణ మారాలని, 2047లోపు 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా తెలంగాణ మారాలని సీఎం ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణ రైజింగ్‌లో భాగంగా కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా మారుస్తున్నామని, తెలంగాణ మహిళలు ధనిక పెట్టుబడిదారులకు పోటీదారులుగా మారుతున్నారని అన్నారు. కాగా ఏషియా పసిఫిక్ ప్రాంతంలో రెండో కేంద్రంగా గూగుల్ సేఫ్టీ ఇంజినీరింగ్ సెంటర్ ను నెలకొల్పారు. ప్రపంచంలో ఇది నాలుగో సెంటర్‌ను హైదరాబాద్లో ప్రారంభించడం విశేషం. ఏషియా పసిఫిక్ రీజియన్లో సురక్షిత డిజిటల్ సేవలు అందించడమే లక్ష్యంగా దీన్ని ప్రారంభించారు. దీంతో ఐటీ రంగంలో వేల సంఖ్యలో ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగావకాశాలు లభించనున్నాయి.

ఈ జీఎస్ఈసీ ప్రారంభ కార్యక్రమంలో గూగుల్ గవర్నమెంట్ అఫేర్స్- పబ్లిక్ పాలసీ వైస్-ప్రెసిడెంట్ విల్సన్ ఎల్ వైట్, గూగుల్ యాడ్ స్పేసెస్ వైస్-ప్రెసిడెంట్ అరిజిత్ సర్కార్ తో పాటు సంస్థ సీనియర్ ప్రతినిధులు పాల్గొన్నారు.



## విద్యతోనే సమాజంలో గౌరవం

### సామూహిక అక్షరాభ్యాసంలో పాల్గొన్న వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**వేద న్యూస్, కరీమాబాద్ :**



తల్లితండ్రులు తమ పిల్లలను క్రమం తప్పకుండా బడికి పంపించాలని, విద్యతోనే గౌరవం సాధ్యమని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. బుధవారం ఖిలా వరంగల్ మండలంలోని కరీమాబాద్, మధ్య కోటలలో గల ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను కలెక్టర్ సందర్శించారు. హాజరు పట్టికలు, రిజిస్టర్లు, తరగతి గదులను పరిశీలించారు.

కరీమాబాద్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమానికి కలెక్టర్ హాజరై చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా ఇప్పటివరకు ఖిలా వరంగల్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో సుమారు 800 మంది చిన్నారులను చేర్పించామని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థులతో మమేకమై వారి సమస్యలు తెలుసుకోవడంతో పాటు వారి చదువు సామర్థ్యాలను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం నాణ్యతను స్వయంగా పరిశీలించిన కలెక్టర్ మధ్యాహ్న భోజన పథకం స్కూళ్లలో మెనూ ప్రకారం ఇస్తున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అందిస్తున్న మధ్యాహ్న భోజనం గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో విద్యార్థులకు గుణాత్మక విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులు అందుబాటులో ఉన్న సౌకర్యాలు వినియోగించుకుని విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలన్నారు. నూతన మెను ప్రకారం పిల్లలకు పోషక విలువలు గల ఆహారాన్ని అందించాలని, విద్యార్థుల ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ చూపించాలన్నారు.

ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో బోధిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం ఉచితంగా బుక్స్ నోట్ బుక్స్ యూనిఫార్మ్ ఇస్తోందని, సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో కార్పొరేటర్ మరుపల్లి రవి, బైరబోయిన ఉమా దామోదర్ యాదవ్, 40 డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు అత్తర్, డిఈఓ జ్ఞానేశ్వర్,ఎంఈఓ ప్రసాద్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



## బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన అందరి బాధ్యత

కలెక్టర్ డాక్టర్ సత్య శారద

వేద న్యూస్, వరంగల్ : 4లో..



వేద న్యూస్

గురువారం, జూన్ 19, 2025

# పట్టాలు తప్పిన జాఫర్ ఎక్స్‌ప్రెస్ రైలు ఆరు బోగీలు

- సింధ్ ప్రావిన్స్‌లోని జకోబాబాద్ వద్ద ఘటన
- రైలు మార్గంలో ఐఈడీ బాంబు అమర్చినట్లు అనుమానం
- పేలుడు ధాటికి ట్రాక్‌పై మూడు అడుగుల గొయ్యి

**వేద న్యూస్, ఇంటర్నెట్ డెస్క్:**

పాకిస్థాన్‌లో మరోసారి ఉగ్రవాదులు రైలు మార్గాన్ని లక్ష్యంగా చేసుకున్నారు. బుధవారం సింధ్ ప్రావిన్స్‌లోని జకోబాబాద్ సమీపంలో రైల్వే ట్రాక్‌పై శక్తివంతమైన బాంబు పేలింది. ఈ ఘటనలో అటుగా వెళ్తున్న జాఫర్ ఎక్స్‌ప్రెస్ రైలుకు చెందిన ఆరు బోగీలు పట్టాలు తప్పాయి.



ఈ విషయాన్ని స్థానిక మీడియా వర్గాలు వెల్లడించాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. క్వెట్టా నుంచి పెషావర్‌కు ప్రయాణిస్తున్న జాఫర్ ఎక్స్‌ప్రెస్ రైలు జకోబాబాద్ వద్దకు చేరుకున్న సమయంలో ఈ పేలుడు సంభవించింది. దుండగులు రైలు మార్గంలో ఐఈడీని అమర్చడం వల్లే ఈ పేలుడు జరిగిందని ప్రాథమిక సమాచారం. పేలుడు తీవ్రతకు రైలు పట్టాలపై సుమారు మూడు అడుగుల లోతైన గొయ్యి ఏర్పడిందని అధికారులు తెలిపారు. ఈ ఘటనలో ఆరు బోగీలు పట్టాలు తప్పడంతో ప్రయాణికులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. అయితే, ఈ ప్రమాదంలో ప్రాణనష్టం లేదా గాయపడిన వారి వివరాలకు సంబంధించి పూర్తి సమాచారం ఇంకా తెలియాల్సి ఉంది. సహాయక బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. కాగా, జాఫర్ ఎక్స్‌ప్రెస్ రైలు గతంలోనూ దాడులకు గురైంది. ఈ ఏడాది మార్చి నెలలో పాకిస్థాన్‌లోని వేర్పాటువాద బలోచ్ మిలిటెంట్లు ఇదే రైలును హైజాక్ చేసి, వందలాది మంది ప్రయాణికులను బందీలుగా పట్టుకున్నారు. వారిని రక్షించేందుకు వెళ్లిన పాక్ భద్రతా సిబ్బందిని కూడా మిలిటెంట్లు హతమార్చారు. అనంతరం పాక్ భద్రతా దళాలు ప్రత్యేక ఆపరేషన్ నిర్వహించి బందీలను విడిపించాయి. ఇప్పుడు మళ్లీ అదే రైలు లక్ష్యంగా దాడి జరగడం కలకలం రేపుతోంది.

## గుర్తుకు వచ్చే రెండవ పేరు రేవంత్ రెడ్డి దే ..



**వేద న్యూస్, హైదరాబాద్ :**

కొత్త గోశాల నిర్మించాలనే నిర్ణయం, తల్లి ఆవు గురించి ఆలోచించినందుకు, విధివిధానాలపై కమిటీని వేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి బీజేపీ ఎమ్మెల్యే రాజా సింగ్ ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడారు. వేల సంఖ్యలో ఆవులు, దూడలు, ఎద్దులను ఇల్లీగల్ స్లేటర్ హౌస్‌లో చంపుతున్నారని దాని గురించి సీఎం ప్లాన్ ఆఫ్ యాక్షన్ గురించి చెప్పాలని కోరారు. మోడల్ గోశాలలు కడుతున్నారని.. చాలా మంచిదని ఆయన వ్యాఖ్యానించారు. గో రక్షణ గురించి ఒక స్పెషల్ పోలీస్ ఫోర్స్ తయారు చేయాలని, అందులో ఒక మెంబర్‌గా తనను కూడా ఉంచాలని ఎమ్మెల్యే రాజాసింగ్ సిఎం రేవంత్ రెడ్డిని కోరారు. దేశంలోని ముఖ్యమంత్రులందరిలో గోవులకు సేవ చేసే నిజమైన ముఖ్యమంత్రి ఎవరని అడిగితే, గుర్తుకు వచ్చే రెండవ పేరు రేవంత్ రెడ్డిదేనని అన్నారు. మొదటి పేరు యూపీ సీఎం యోగి అని పేర్కొన్నారు. ఈ పనులన్నీ ముఖ్యమంత్రి చేస్తే భారత దేశంలో ఒక మంచి గుర్తింపు దొరుకుతుందని ఎమ్మెల్యే రాజాసింగ్ అన్నారు. తెలంగాణలో గోవుల సంరక్షణకు ఎంత ఖర్చైనా ప్రభుత్వం వెనుకాడబోదని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. గోవుల సంరక్షణకు సమగ్ర విధానాన్ని రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఇందుకోసం ముగ్గురు అధికారులతో ఒక కమిటీని నియమించారు. గోవుల సంరక్షణ కోసం వివిధ రాష్ట్రాల్లో అమలవుతున్న విధానాలను అధ్యయనం చేయాలని ఈ కమిటీని కోరారు. రాష్ట్ర పశుసంవర్ధక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు ఈ కమిటీలో ఉన్నారు. గో సంరక్షణపై రేవంత్ రెడ్డి మంగళవారం సాయంత్రం తన నివాసంలో సమీక్ష నిర్వహించారు. మన సంస్కృతిలో గోవులకు ఉన్న ప్రాధాన్యం, భక్తుల మనోభావాలను దృష్టిలో పెట్టుకోవాలని అధికారులకు సూచించారు. గోశాలలకు భక్తులు పెద్ద సంఖ్యలో గోవులను దానం చేస్తున్నారని, కానీ వాటి సంరక్షణకు తగినంత స్థలం లేకపోవడం, ఇతర సమస్యలతో అవి ఎక్కువ సంఖ్యలో మృత్యువాత పడుతున్నాయని రేవంత్ ఆవేదన వ్యక్తం చేశారు.

## తెలంగాణలో వానలే వానలు హెచ్చరించిన ఐఎండీ



**వేద న్యూస్, హైదరాబాద్ :**

తెలంగాణలో ఈ నెల 22 వరకు వర్షాలు కొనసాగుతాయని వాతావరణశాఖ తెలిపింది. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వానలు పడే సూచనలున్నాయని వెల్లడించింది. తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసేందుకు అవకాశాలున్నాయని వివరించింది. ఈ మేరకు వాతావరణశాఖ ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. బుధశారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో అక్కడక్క వర్షాలు పడేందుకు అవకాశం ఉందని పేర్కొంది. గురువారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో వానలు పడుతాయని చెప్పింది. శుక్ర, శనివారాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వివరించింది. ఆదివారం భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ వానలు పడే అవకాశాలున్నాయని వివరించింది.

## తమిళనాడు ఏడీజీపీ సస్పెన్షన్..
# సుప్రీంకోర్టు సీరియస్

**వేద న్యూస్, న్యూఢిల్లీ :**




తమిళనాడు రాష్ట్రం తిరువళ్లూరు జిల్లా కళంబాక్కంకు సంబంధించిన ఓ ప్రేమ వ్యవహారంలో యువకుడి కిడ్నాప్ తీవ్ర దుమారానికి దారితీసింది. ఈ కేసులో మద్రాస్ హైకోర్టు ఆదేశాల మేరకు ఏడీజీపీ జయరామ్ ను అరెస్టు చేయడంతో రాష్ట్ర ప్రభుత్వం ఆయనను విధుల నుంచి సస్పెండ్ చేసింది. దీనిపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. ఓ సీనియర్ పోలీసు అధికారి విచారణలో పాల్గొన్నందుకు ఆయనను ఎలా సస్పెండ్ చేస్తారంటూ తమిళనాడు ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. ఆయనను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ఆదేశించింది. వివరాల్లోకి వెళ్తే.. కళంబాక్కంకు చెందిన ఓ యువకుడు ఇటీవల తేనికి చెందిన యువతిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. కొన్ని రోజుల తర్వాత ఆ యువకుడి 16 ఏళ్ల సోదరుడు కిడ్నాప్ అయ్యాడు. ఈ కిడ్నాప్ వ్యవహారంలో ఏడీజీపీ జయరామ్‌కు సంబంధం ఉందని ఆరోపణలు వచ్చాయి. ఈ కేసుకు సంబంధించి ఇటీవల విచారణ జరిపిన మద్రాస్ హైకోర్టు ఏడీజీపీని అరెస్టు చేయాలని ఆదేశాలు ఇచ్చింది. దాంతో పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలో ఏడీజీపీ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అరెస్టైన వారు ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా ఏడీజీపీ హోదాలో ఉన్న తనను అరెస్టు చేశారని ఆయన తన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై సుప్రీంకోర్టు బుధవారం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా తమిళనాడు ప్రభుత్వ కౌన్సిల్ వాదనలు వినిపించారు. ఏడీజీపీని కస్టడీలోకి తీసుకుని విచారణ అనంతరం మంగళవారం సాయంత్రమే విడుదల చేశామని ఆయన సుప్రీంకోర్టుకు తెలిపారు. అయితే తనను పోలీసులు విడుదల చేసినప్పటికీ ప్రభుత్వం సస్పెన్షన్ వేటు వేసిందని ఏడీజీపీ వాదించారు. దాంతో సుప్రీం ధర్మాసనం అసహనం వ్యక్తంచేసింది. ఆయనొక సీనియర్ పోలీసు అధికారి అని, ఆయయను సస్పెన్షన్‌లో పెట్టాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించింది. ఈ కేసులో హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులు ఆశ్చర్యం కలిగించాయని వ్యాఖ్యానించింది. ఆ ఉత్తర్వులు నిరుత్సాహపరిచేలా ఉన్నాయని కోర్టు ఆగ్రహించింది. గురువారం నాటికి ఏడీజీపీపై సస్పెన్షన్‌ను రద్దు చేసి.. ఆ సమాచారాన్ని న్యాయస్థానానికి తెలియజేయాలని ఆదేశించింది.

## జగన్ పర్యటనలో విషాదం

**వేద న్యూస్, డెస్క్:**

ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ గుంటూరు పర్యటనలో విషాదం చోటుచేసుకుంది. ఆయన కాన్వాయ్ లోని వాహనం ఢీ కొట్టడంతో ఓ వృద్ధుడు మరణించాడు. గుంటూరు జిల్లా ఏటుకూరు సమీపంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. సత్తెనపల్లి మండలం రెంటపాళ్లలో పర్యటించేందుకు వైఎస్ జగన్ ఈ రోజు ఉదయం భారీ కాన్వాయ్ తో తాడేపల్లి నుంచి బయలుదేరారు. జగన్ పర్యటన నేపథ్యంలో వైసీపీ కార్యకర్తలు వాహనాల ర్యాలీ నిర్వహించారు.

ఈ క్రమంలో ఏటుకూరు బైపాస్ వద్ద నడుచుకుంటూ వెళుతున్న ఓ వృద్ధుడిని జగన్ కాన్వాయ్ లోని ఓ వాహనం ఢీ కొట్టింది. దీంతో వృద్ధుడికి తీవ్ర గాయాలయ్యాయి. వృద్ధుడిని ఢీ కొట్టినా వైసీపీ లీడర్లు పట్టించుకోకుండా వెళ్లిపోయారు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే 108 కు సమాచారం అందించారు. అంబులెన్స్ సిబ్బంది వెంటనే అక్కడికి చేరుకుని వృద్ధుడిని గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ వృద్ధుడు మరణించాడని వైద్యులు తెలిపారు. కాగా, వృద్ధుడిని ఢీ కొట్టినా కాన్వాయ్ ఆపకుండా వెళ్లిపోవడంతో వైసీపీ నేతలపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


## ఇంటర్ సప్లిమెంటరీ మార్కుల మెమోలు విడుదల



**వేద న్యూస్, హైదరాబాద్ :**

తెలంగాణ ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు జూన్ 16న విడుదలైన సంగతి తెలిసిందే. ఈ ఫలితాల్లో 50.82 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. మొత్తం 4,13,880 మంది విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్షలు రాశారు. ఇందులో ఫస్ట్ ఇయర్‌లో 2,49,358 మంది పరీక్షలు రాస్తే.. అందులో 1,68,079 మంది అంటే 67.4 శాతం ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరంలో 1,47,518 మంది పరీక్షలు రాయగా.. ఇందులో 76,260 మంది ఉత్తీర్ణులయ్యారు. సప్లిమెంటరీకి రీకౌంటింగ్, రీవెరిఫికేషన్‌కు దరఖాస్తు చేసుకునేందుకు జూన్ 17 నుంచి జూన్ 23వ తేదీ వరకు అవకాశం కూడా ఇచ్చారు. రీకౌంటింగ్, రీవెరిఫికేషన్‌కు ఒక్కో సబ్జెక్టుకు రూ.100 చొప్పున విద్యార్థులు రుసుము చెల్లించాల్సి ఉంటుంది. అలాగే రీవెరిఫికేషన్‌తోపాటు స్కాన్ కాఫీ పొందుకు ఒక్కో సబ్జెక్టుకు రూ.600 చెల్లించవల్సి ఉంటుంది. మరోవైపు ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల షార్ట్ మెమోలను కళాశాలలకు పంపామని ఇంటర్ బోర్డు అధికారులు తెలిపారు. విద్యార్థులు సైతం వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. మార్కుల మెమోల్లో పొరపాట్లు ఉంటే పది రోజులలోపు ప్రిన్సిపాళ్ల ద్వారా తెలియజేయాలని సూచించారు.

## బేగంపేట ఎయిర్‌పోర్ట్‌కు బాంబు బెదిరింపు




- ఈమెయిల్ ద్వారా హెచ్చరిక - ఎలాంటి బాంబు లేదన్న అధికారులు

**వేద న్యూస్, హైదరాబాద్ :**

హైదరాబాద్ నగరంలోని బేగంపేట విమానాశ్రయంలో బుధవారం ఉదయం కొద్దిసేపు తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. విమానాశ్రయంలో బాంబు పెట్టినట్లు గుర్తు తెలియని వ్యక్తి నుంచి ఈమెయిల్ ద్వారా వచ్చిన సందేశం కలకలం రేపింది. ఈ సమాచారం అందుకున్న వెంటనే నగర పోలీసులు, విమానాశ్రయ భద్రతా సిబ్బంది అప్రమత్తమయ్యారు. బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ బృందాలు హుటాహుటిన విమానాశ్రయానికి చేరుకున్నాయి. ఎయిర్‌పోర్ట్ ప్రాంగణమంతా క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. ప్రతి మూలను గాలించినప్పటికీ ఎటువంటి పేలుడు పదార్థాలు గానీ, అనుమానాస్పద వస్తువులు గానీ లభ్యం కాలేదు. గంటల తరబడి విస్తృతంగా సోదాలు చేసిన అనంతరం విమానాశ్రయంలో ఎలాంటి బాంబు లేదని అధికారులు నిర్ధారించారు. దీంతో అటు పోలీసులు, ఇటు విమానాశ్రయ సిబ్బందితో పాటు ప్రయాణికులు కూడా ఊపిరి పీల్చుకున్నారు. ఎవరో ఆకతాయి కావాలనే ఈ బెదిరింపు ఈమెయిల్ పంపి ఉంటారని పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. ఈమెయిల్ పంపిన వ్యక్తిని గుర్తించేందుకు దర్యాప్తు ప్రారంభించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ ఘటనతో విమానాల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగలేదని సమాచారం.

## తాము ఎవరి అడ్డుకోలేదని వారు స్పష్టం

వేద న్యూస్, అమరావతి :

కోల్‌కతా ఎయిర్‌పోర్ట్‌లో వైసీపీ నేత, మాజీ మంత్రి కొడాలి నానిని అధికారులు అడ్డుకున్నారంటూ సోషల్ మీడియా వేదికగా వైరల్ అవుతున్న వార్తా కథనాలపై ఆంధ్రప్రదేశ్ పోలీసులు దృష్టి సారించారు. అందులోభాగంగా వారు దర్యాప్తు చేపట్టారు. అయితే కొడాలి నాని హైదరాబాద్‌లోనే ఉన్నట్లు ఏపీ పోలీసులు ధృవీకరించారు. కొడాలి నాని కొలంబో వెళ్తుండగా ఆయన్ని కోల్‌కతా ఎయిర్‌పోర్ట్‌లో అరెస్ట్ చేసినట్లు వార్తలు వెలువడ్డాయి. దీంతో ఏపీ పోలీస్ ఉన్నతాధికారులు.. కోల్‌కతా ఎయిర్‌పోర్ట్ అధికారులతో ఈ వ్యవహారంపై మాట్లాడారు. తాము ఎవరి అడ్డుకోలేదని వారు స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో ఈ వార్తా కథనాలు వైరల్ కావడం వెనుక ఎవరున్నారనే కోణంలో పోలీసులు.. తమ దర్యాప్తును ముమ్మరం చేశారు. ఉద్రిక్తతలు రెచ్చగొట్టేందుకే ఈ వార్తలు సృష్టించి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. ఇంకోవైపు వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ బుధవారం గుంటూరు జిల్లా సత్తెనపల్లి నియోజకవర్గంలోని రెంటపాళ్లలో పర్యటిస్తున్నారు. అందుకోసం ఆయన భారీ కాన్వాయ్‌తో తాడేపల్లి ప్యాలెస్ నుంచి బయలుదేరారు. అయితే జగన్ పర్యటన నేపథ్యంలో పోలీసులు పలు ఆ ప్రాంతంలో పలు ఆంక్షలు విధించారు.

# సంపాదకీయం

## న్యాయవ్యవస్థపై సడలుతున్న నమ్మకం

గత మార్చి నెలలో ఢిల్లీ న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ అధికార నివాసంలో భారీ స్థాయిలో కాలిపోయిన నోట్ల కట్టల ఉదంతం దేశవ్యాప్తంగా కలకలం రేపింది. ఆ దృశ్యాలన్నీ ప్రముఖ టివి ఛానల్లలో ప్రసారమవ్వడమే కాకుండా అన్ని పత్రికలు పతాక శీర్షికన ఆ వార్తను ప్రచురించడంతో న్యాయ వ్యవస్థ విశ్వసనీయతపై నీలి నీడలు కమ్ముకున్నాయని న్యాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అంతేకాక అపనమ్మకం కలిగించే ఇలాంటి సంఘటనల గురించి ప్రజలు పలు విధాలుగా చర్చించుకునేందుకు తావివ్వడంతో పాటు ఇలాంటి సంఘటనలు అన్ని వ్యవస్థల్ని అసంతృప్తికి గురిచేస్తాయని వారు వాపోతున్నారు. సగటు పౌరుని అనుమానాన్ని నివృత్తి చేయడం ద్వారా న్యాయ వ్యవస్థపై నమ్మకాన్ని కలిగించేందుకు కేంద్రం దిద్దుబాటు చర్యలకు పూనుకుంటోంది. దాని కోసం వడివడిగా అడుగులు వేస్తోంది. అందుబాటులో ఉన్న అన్ని అస్త్రాలను సంధించి జస్టిస్ వర్మను సాగనంపడానికి సిద్ధపడుతోంది. జస్టిస్ వర్మ ఇంట్లోకి ఆ నోట్లకట్టలు ఎలా వచ్చాయి? ఎవరిచ్చారు? అనే దానిపై విచారణ చేపట్టడానికి కోర్టులు అనుమతించలేదు. ఎఫ్ఐఆర్ చేయడానికి కూడా అవకాశం ఇవ్వలేదు. సుప్రీం కోర్టు ఎలాంటి బహిరంగ ప్రకటన చేయనప్పటికీ సుప్రీం కోర్టుయే చొరవ తీసుకుని ఇన్ హౌస్ కమిటీని వేసి విచారణ చేపట్టి నివేదిక ఇచ్చినట్లు సమాచారం. వర్మకు కీలక సూచనలు, ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోంది. సుప్రీం కోర్టు జస్టిస్ వర్మను ఢిల్లీ నుండి అలహాబాద్ కోర్టుకు బదిలీ చేసింది. ఆయన అలహాబాద్‌కు వస్తే బహిష్కరిస్తామని అక్కడి బార్ కౌన్సిల్ ప్రకటన చేసిన నేపథ్యంలో ఆయన రావడం రిపోర్టు చేయడం జరిగిపోయినప్పటికీ కేసులు అసైన్ చేయలేదు. అలా చేయడం న్యాయవ్యవస్థపై ప్రజల మనసులలో తొలుస్తున్న అనుమానాలకు సమాధానం కాదని పలువురు న్యాయకోవిదులు బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు.

ఇదే అంశంపై ఉపరాష్ట్రపతి జగదీప్ దన్‌ఖడ్ కూడా రెండోసారి వ్యాఖ్యానించడం ఈ సంఘటన ఎంత ప్రాధాన్యతను సంతరించుకున్నదో అవగతమవుతున్నది. వ్యవస్థలను ప్రజలకు జవాబుదారీగా ఉంచాలనే ఉద్దేశంతోనే అభిశంసన తీర్మానం అనేది రాజ్యాంగంలో ప్రవేశపెట్టబడింది. ఈ అభిశంసన అనేది హైకోర్టు, సుప్రీం కోర్టు న్యాయమూర్తుల పారదర్శకతపై అనుమానాలు, విమర్శలు, ఆరోపణలు తలెత్తినప్పుడు వారిని తొలగించేందుకు చేపట్టే ప్రక్రియ. ఇది చట్టపరంగా పార్లమెంటుకు ఉన్న ప్రత్యేకమైన వెసులుబాటు. ఈ ప్రక్రియను జడ్జెస్ ఎంక్వయిరీ యాక్ట్ 1968 ద్వారా చేపడతారు. లోక్‌సభలో అయితే కనీసం 100 మంది, రాజ్యసభ అయితే 50 మంది సభ్యులు ఈ తీర్మానం మీద సంతకం చేయాలి. రాజ్యసభ చైర్మన్ లేదా లోక్‌సభ స్పీకర్ చేత నియమించబడ్డ విచారణ కమిటీ ద్వారా నివేదిక ఇవ్వబడుతుంది.

ఆ నివేదిక ద్వారా న్యాయమూర్తి దోషిగా తేలితే దానిని పార్లమెంటు ఉభయ సభలలో ప్రవేశపెట్టబడి మూడింట రెండోవంతు మెజారిటీతో ఆమోదించబడితే రాష్ట్రపతి సదరు న్యాయమూర్తిని తొలగిస్తారు. ఇప్పుడు ఉన్న పరిస్థితులలో ఆ మెజారిటీ సాధించడం అధికార పక్షానికి పెద్ద కష్టమేమీ కాదని రాజకీయ పండితులు అంచనా వేస్తున్నారు. విపక్షాలపై ఆధారపడకుండానే అభిశంసన ప్రక్రియను పూర్తి చేసే అవకాశం ఉన్నప్పటికీ వర్మ తీరును విపక్షాలు సైతం తప్పు పడుతుండడంతో అభిశంసనకు మరింత బలం చేకూరడం తథ్యమని విమర్శకులు సైతం విశ్లేషిస్తున్నారు. యశ్వంత్ వర్మ కేసు విషయంలో సుప్రీం కోర్టు నియమించిన ఇన్ హౌస్ కమిటీ నివేదికలో భారీ మొత్తంలో కాలిపోయిన నోట్ల కట్టల ఆధారాన్ని బలంగా పేర్కొనడంతో అభిశంసనకు మరింత మద్దతు పెరగడం ఖాయమని న్యాయనిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఇదిలా ఉండగా ఇప్పటివరకు అభిశంసన ప్రక్రియలు చాలా అరుదుగానే జరిగాయి. 1991లో సుప్రీం కోర్టు న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ వి రామస్వామిపై ఆర్థిక అవకతవకల ఆరోపణలతో లోక్‌సభలో 108 మంది సభ్యులచే అభిశంసన తీర్మానాన్ని ప్రవేశపెట్టబడినప్పటికీ కాంగ్రెసు గైర్హాజరు కావడంతో ఈ తీర్మానం వీగిపోయింది. ఆయన పూర్తికాలం కొనసాగినప్పటికీ ఆయనకు కేసులు మాత్రం అసైన్ చేయలేదు. ఇక 2011లో కలకత్తా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సౌమిత్రా సేన్ పై ఆర్థిక అవకతవకలపై రాజ్యసభలో తీర్మానం ప్రవేశపెట్టబడి ఆమోదించబడింది. లోక్‌సభలో ఓటింగ్‌కు ముందే ఆయన రాజీనామా చేయడంతో ఆ వివాదం అంతటితో ముగిసిపోయింది. 2017లో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సివి నాగార్జున్ రెడ్డిపై అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టబడినప్పటికీ కొంతమంది ఎంపిలు తమ సంతకాలను ఉపసంహరించడంతో అది కూడా వీగిపోయింది. 2018లో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రాపై రాజ్యసభలో విపక్షాలన్నీఏకమై రాజకీయపరమైన అభిప్రాయాలతో అభిశంసన తీర్మానాన్ని ప్రవేశపెట్టినప్పటికీ రాజ్యసభ చైర్మన్ దాన్ని ప్రాథమిక దశలోని తిరస్కరించడంతో తీర్మానం ముందుకు పోలేదు. ఇలా వెలుగులోకి వచ్చిన సంఘటనలు కొన్ని మాత్రమేనని చీకట్లో ఇంకా ఎన్ని ఉన్నాయోనని ప్రజాస్వామికవాదులు గుసగుసలాడుకుంటున్నారు. రాజ్యాంగపరమైన అంశాలపై ఇటీవల దాఖలైన పలు పిటిషన్లను నామమాత్రమైనా పరిశీలించకుండానే ఆదిలోనే కొట్టివేయడాన్ని ఈ సందర్భంగా ఉటంకిస్తున్నారు. ప్రజాభిప్రాయానికి ప్రతిబింబంగా నిలిచే పార్లమెంటును సైతం న్యాయమూర్తుల నియామకంలో భాగస్వామ్యం చేయకపోవడమేంటని వారు ప్రశ్నిస్తున్నారు. మరోపక్క స్వయం ప్రతిపత్తి అనే పేరున న్యాయ వ్యవస్థలో న్యాయమూర్తుల నియామకాన్ని న్యాయమూర్తులే చేపట్టడం వల్ల పారదర్శకత లోపిస్తున్నదని, జవాబుదారీతనం అడుగంటుతుండడమేకాక 'అంకుల్ జడ్జ్ సిండ్రోమ్' వల్ల తమ అనుయాయులకే పెద్దపీట వేసే అవకాశం ఉన్నదని న్యాయ కోవిదులు అభిప్రాయపడుతున్నారు. దీన్ని అధిగమించడానికి 99వ రాజ్యాంగ సవరణ ద్వారా తీసుకువచ్చిన జాతీయ న్యాయ నియామకాల కమిషన్ తరహాలో సరికొత్త కమిషన్ ను ఏర్పాటు చేయవలసిన ఆవశ్యకత ఉన్నదని రాజ్యాంగ నిపుణులు సైతం కోరుతున్నారు. మొత్తం మీద పూర్తిస్థాయిలో వ్యవస్థను ప్రక్షాళన చేసి సగటు భారతీయునిలో రాజ్యాంగం పట్ల, న్యాయవ్యవస్థ పట్ల గౌరవాన్ని పెంపొందించే విధంగా అడుగులు పడతాయని ఆశిద్దాం!

# ఫాస్టాగ్‌పై కేంద్రం కీలక నిర్ణయం..!

**వేద న్యూస్, న్యూఢిల్లీ :**

వాహనదారులకు కేంద్ర ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది. తరచూ టోల్ రోడ్డు వారే వాడికి అదిరిపోయే ప్లాన్ తీసుకొచ్చింది. జాతీయ రహదారులపై టోల్ కలెక్షన్ విధానంలో మరో కొత్త విధానం అందుబాటులోకి రానుంది. ఫాస్ట్ ట్యాగ్‌పై కేంద్ర రోడ్లు రహదారుల శాఖ మంత్రి కీలక ప్రకటన చేశారు. ఏడాదికి ఒకసారి రిచార్జ్ చేసుకుని యాక్టివేషన్ తేదీ నుంచి ఏడాది వరకు లేదా 200 ట్రిప్పులు వరకు తిరిగే వెసులుబాటు తీసుకువస్తున్నట్లు ప్రకటించారు. ఏడాదికి రూ.3 వేలు చెల్లిస్తే దేశంలో ఎక్కడైనా తిరిగే అవకాశం కల్పిస్తూ కొత్త విధానం తీసుకువచ్చింది కేంద్రం. ఈ ఏడాది ఆగష్టు 15 నుంచి ఈ విధానాన్ని అమలు చేస్తున్నట్లు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ప్రకటించారు. దేశంలో జాతీయ రహదారులపై నిర్బంధ రహిత ప్రయాణాన్ని లక్ష్యంగా పెట్టుకుని, ఫాస్టాగ్ ఆధారిత వార్షిక పాస్‌ను ప్రవేశపెడుతున్నట్లు గడ్కరీ తెలిపారు. వాణిజ్యేతర, వ్యక్తిగత వాహన దారులు ఈ వార్షిక పాస్ వినియోగించుకోవచ్చు. కార్లు, జీపులు, వ్యాన్లు వంటి వాణిజ్యేతర ప్రైవేట్ వాహనాల కోసం ఈ పాస్ ప్రత్యేకంగా రూపొందించారు. భారత టోల్ వ్యవస్థలో అవినీతికి తావులేకుండా డిజిటల్ రూపంలో టోల్ టాక్స్ కలెక్ట్ చేసేందుకు ఫాస్ట్ ట్యాగ్‌ను కేంద్రం తీసుకొచ్చిన విషయం తెలిసిందే. ఈ వార్షిక పాస్ దేశవ్యాప్తంగా జాతీయ రహదారులపై సజావుగా, ఖర్చుతో కూడుకున్న ప్రయాణాన్ని అనుమతిస్తుంది. వార్షిక పాస్ యాక్టివేషన్, రెన్యూవల్ కోసం ప్రత్యేక లింక్ త్వరలో రాజ్‌మార్గ్ యాత్ర యాప్‌లో అలాగే అధికారిక వెబ్‌సైట్‌లలో అందుబాటులోకి వస్తుందని తెలిపారు. ఈ విధానం 60 కి.మీ పరిధిలో ఉన్న టోల్ ప్లాజాల గురించి




దీర్ఘకాలికంగా వాహనదారులకు ఉన్న సమస్యలను పరిష్కరిస్తుంది. ఒకేసారి రీఛార్జ్ ద్వారా టోల్ చెల్లింపులను సులభతరం చేస్తుంది. వేచి ఉండే సమయాన్ని తగ్గించడం, రద్దీని తగ్గించడం టోల్ ప్లాజాల వద్ద వివాదాలను తగ్గించడం ద్వారా, లక్షలాది మంది ప్రైవేట్ వాహన వాహనదారులు వేగవంతమైన ప్రయాణ అనుభవాన్ని అందించడం లక్ష్యంగా వార్షిక పాస్ ఉపయోగపడనుంది. మరి ఇంకేందుకు ఆలస్యం ఎక్కువగా టోల్ రోడ్లలను వినియోగించే వారు ఈ ప్లాన్ తీసుకోండి.


# ట్రంప్‌నకు కౌంటర్ ఇచ్చిన ప్రధాని మోదీ!

**వేద న్యూస్, న్యూఢిల్లీ :**



భారత్-పాక్ మధ్య యుద్ధం ఆపింది నేనే అంటూ పదేపదే చెప్పుకుంటున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కి మోదీకి గట్టి డోస్ ఇచ్చారు. "మీకు అంత సీన్ లేదు" అని అర్థం వచ్చేలా క్లాస్ తీసుకున్నంత పనిచేశారు. మీ జోక్యాన్ని ఎవ్వరూ అడగలేదంటూ ట్రంప్‌కి తేల్చిచెప్పారు ప్రధాని మోదీ. భారత్, పాక్ మధ్య ట్రంప్ మధ్యవర్తిత్వం ప్రకటనను ప్రధాని మోదీ ఖండించారు. జమ్ముకశ్మీర్‌పై భారత్-పాక్ మధ్య ఎవరి మధ్యవర్తిత్వం అవసరం లేదని కూడా స్పష్టం చేశారు. ఇక ముందు కూడా ఒప్పుకునే ప్రసక్తే లేదని అన్నారు. ట్రంప్ విజ్ఞప్తి మేరకు 35 నిమిషాల పాటు మోదీ ఫోన్ కాల్ మాట్లాడారు. ఈ సందర్భంగా.. "కాల్పుల విరమణపై పాక్‌తో మేం నేరుగా చర్చించాం. పాక్ విన్నపం మేరకు కాల్పుల విరమణపై చర్చించాం. ఆపరేషన్ సింధూర్ కొనసాగుతూనే ఉంది." ప్రధాని అన్నారు. వాస్తవానికి ఈ విషయాన్ని మోదీ నేరుగా ట్రంప్‌కే చెప్పాల్సి ఉంది. కానీ కెనడాలో ఇద్దరు నేతల సమావేశం జరగలేదు. కానీ ఇరాన్-ఇజ్రాయెల్ ఉద్రిక్తతల నేపథ్యంలో ట్రంప్- హుటాహుటిన అమెరికాకు బయల్దేరారు. మోదీని కలుసుకోలేకపోయిన ట్రంప్, ఆయనతో ఫోన్‌లో మాట్లాడినట్లు భారత విదేశాంగశాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రి వివరించారు. కెనడాలో 7 సమ్మిట్‌లో పాల్గొని ప్రధాని మోదీ క్రొయేషియా వెళ్లారు. దానికి ముందు తిరుగు ప్రయాణంలో అమెరికా వస్తారా అని ట్రంప్ ప్రధాని మోదీని అడిగారు. ప్రస్తుత షెడ్యూల్ కారణంగా అది కుదరదని మోదీ, ట్రంప్‌తో అన్నారు. అయితే త్వరలో సమావేశం కావాలని నిర్ణయం తీసుకున్నారు. అలాగే ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధంపైనా కూడా చర్చించారు. రష్యా-ఉక్రెయిన్ నేరుగా మాట్లాడుకోవాలని మోదీ అభిప్రాయపడ్డారు.

# పిడుగుల వర్షం..



## - 12 మంది దుర్మరణం


**వేద న్యూస్, డెస్క్:**

బీహార్ రాష్ట్రంలో వర్ష బీభత్సం సృష్టించింది. ఈదురు గాలులు, వడగళ్ల వానలు రాష్ట్రంలోని పలు జిల్లాలను అతలాకుతలం చేశాయి. వర్షం కారణంగా అనేక చోట్ల పిడుగులు పడ్డాయి. ఈ పిడుగుల కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 12 మంది ప్రాణాలు కోల్పోయారు. బక్సర్‌లో నలుగురు, పశ్చిమ చంపారన్‌లో ముగ్గురు, కతిహార్‌లో ఇద్దరు, కైమూర్, లఖిసరై, సీతామర్హి జిల్లాల్లో ఒక్కొక్కరు చొప్పున మొత్తం 12 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనపై సీఎం నితీశ్ కుమార్ విచారం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు సంతాపం తెలియజేశారు. అంతేకాదు మృతుల కుటుంబాలకు రూ.4 లక్షలు (ఒక్కో కుటుంబానికి) ఇస్తామని ప్రకటించారు. ఈ సందర్భంగా ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, వర్షం పడుతున్న సమయంలో బహిరంగ ప్రదేశాలకు వెళ్లకుండా ఇంటిపట్టునే ఉండాలని సూచించారు.

# బాలుడి కళ్లెదుటే తల్లి దారుణం..

## - కట్టుకున్న భర్తను ప్రియుడితో కలిసి కడతేర్చింది.

**వేద న్యూస్, న్యూఢిల్లీ :**





తొమ్మిదేళ్ల కొడుకు ముందే ఒక తల్లి దారుణానికి ఒడిగట్టింది. ప్రియుడి కోసం కట్టుకున్న భర్తను అతి దారుణంగా హత్య చేయించింది. ఎంతకు తెగించిందంటే.. కట్టుకున్న భర్తను ప్రియుడితో కలిసి కడతేర్చింది. ఈ దారుణమైన ఘటన రాజస్థాన్‌లోని అల్వార్ జిల్లా ఖేర్లీ ప్రాంతంలో ఈ నెల 7న అర్ధరాత్రి చోటుచేసుకుంది. అయితే, ఈ కేసులో తొమ్మిదేళ్ల చిన్నారి బాలుడు కీలక సాక్షిగా మారాడు. వీరూ అలియాస్ మాన్ సింగ్ జాతవ్ అనే వ్యక్తి తన ఇంట్లోనే అనుమానాస్పదంగా మృతిచెందాడు. అనారోగ్యం కారణంగానే తన భర్త అకస్మాత్తుగా మరణించాడని భార్య అనిత అందరినీ నమ్మించే ప్రయత్నం చేసింది. అయితే, చనిపోయిన మాన్ సింగ్ కుమారుడు పోలీసులకు అసలు విషయాలు చెప్పడంతో కేవలం 48 గంటల్లోనే ఈ హత్య వెనుక ఉన్న నిజాలు బయటపడ్డాయి. అసలేం జరిగిందంటే.. తొమ్మిదేళ్ల చిన్నారి బాలుడు చెప్పిన వివరాల ప్రకారం.. ఈ నెల 7వ తేదీన రాత్రి మా నాన్న మాన్ సింగ్ మంచంపై నిద్రపోతున్నాడు. నేను అప్పుడే నిద్రపోతున్నాను. అయితే, ఇంతలో తలుపు వద్ద ఏదో శబ్దం వినిపించింది. కళ్లు తెరిచి చూస్తే ఆ సమయంలో మా అమ్మ అనిత తలుపు తీస్తోంది. బయట చూస్తే కాశీ అంకుల్ ఉన్నాడు. అయితే, అతడితో పాటు మరో నలుగురు వ్యక్తులు కూడా వచ్చారు. నాకు బాగా భయమేసింది.. నేను లేవలేకపోయాను.. సైలెంట్‌గా ఉంటూ ఏం జరుగుతుందో గమనించాను. అయితే, వాళ్లు మా గదిలోకి వచ్చారు. అమ్మ ఏమో నాన్న పడుకున్న మంచం ముందు నిలబడి ఉంది. ఆ వ్యక్తులు నాన్నను గట్టిగా గుద్దారు, కాళ్లు విరిచారు, గొంతు నులిమి చంపే ప్రయత్నం చేశారు. ఇక నేను వెంటనే నాన్న దగ్గరకు వెళ్తుంటే.. కాశీ అంకుల్ నన్ను బెదిరించాడు.. తర్వాత నాన్న ముఖంపై దిండు పెట్టి ఊపిరాడకుండా చేసి చంపేశారు. ఇక భయంతో నేను సైలెంట్‌గా ఉండిపోయాను. ఆ తర్వాత అందరూ ఇంట్లో నుండి వెళ్లిపోయారు అని ఆ బాలుడు పోలీసులకు చెప్పాడు.

### వివాహేతర సంబంధం

పోలీసుల ప్రకారం.. భార్య అనిత, కాశీ అనే వ్యక్తి ప్లాన్ ప్రకారమే మాన్ సింగ్‌ను చంపారు. ఎందుకంటే, వారిద్దరి మధ్య వివాహేతర సంబంధం ఉంది. అనిత ఒక చిన్న కిరాణా షాపు నడుపుతుండగా, స్థానికంగా ఉన్న కాశీ తరచూ ఆ దుకాణానికి వెళ్లేవాడు. ఈ క్రమంలోనే వారిద్దరి మధ్య వివాహేతర సంబంధం ఏర్పడింది. ఇందుకు భర్త అడ్డుగా ఉన్నాడని, అతడిని చంపడానికి అనిత, కాశీ నలుగురు కిరాయి హంతకులకు రూ. 2 లక్షలు సుపారీ ఇచ్చినట్టు తేలింది. చిన్నారి బాలుడు కీలక సాక్షిగా ఉండటంతో అనిత, కాశీ సహా నలుగురు కిరాయి హంతకులు జైల్లో ఊచలు లెక్కపెడుతున్నారు.



# ఇక నేనే రంగంలోకి దిగుతా

**వేద న్యూస్, డెస్క్:**

చిత్తూరు జిల్లా కుప్పంలో చోటుచేసుకున్న అమానుష ఘటన, ఓ మహిళను చెట్టుకు కట్టేసి కొట్టిన ఉదంతంపై ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ తీవ్రంగా స్పందించారు. ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తే తానే రంగంలోకి దిగుతానని ఆయన హెచ్చరించారు. ఈ అంశంపై ముఖ్యమంత్రి చంద్రబాబుకు తాను లేఖ రాశానని... తన లేఖకు వారం రోజుల్లోగా రిప్లై ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఒక విషయంలో చంద్రబాబును అభినందిస్తున్నానని... మహిళను కట్టేసి కొట్టిన విషయం తెలిసిన వెంటనే చంద్రబాబు స్పందించారని ప్రశంసించారు. కుప్పం ఘటనలో బాధితురాలిని కొట్టిన వ్యక్తులపై ఇండియన్ పీనల్ కోడ్ సెక్షన్ 302 కింద కేసు నమోదు చేయాలని కేఏ పాల్ డిమాండ్ చేశారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే శాశ్వత పరిష్కారాలు అవసరమని పాల్ నొక్కిచెప్పారు. "ఇలాంటి విషయాలు ఎన్నో జరుగుతున్నాయి. మరోసారి ఇలాంటివి జరగకుండా ఉండాలంటే అసెంబ్లీలో బిల్లు పెట్టాలి. ప్రభుత్వం సరైన చర్య తీసుకోకపోతే నేనే రంగంలోకి దిగుతా" అని పాల్ ప్రకటించారు. అప్పులిచ్చి వేధించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, తమిళనాడులో స్టాలిన్ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల తరహాలో ఇక్కడ కూడా అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టాలని ఆయన సూచించారు. "అప్పులిచ్చి మహిళలను కొట్టి, వారి ఆడపిల్లలను ఎత్తుకెళ్లి అప్పులు వసూలు చేసుకుంటున్నారు. ఇది ఎంత దారుణం? అలా వసూలు చేసేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. వారికి రూ. 5 లక్షల జరిమానా, 5 ఏళ్ల జైలు శిక్ష విధించాలి. అటువంటి బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టాలని సీఎం చంద్రబాబును కోరుతున్నాను" అని పాల్ తెలిపారు. ఈ సందర్భంగా కేఏ పాల్, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా ఇచ్చిన హామీలు, ముఖ్యంగా సూపర్ సిక్స్ పథకాలు ఎక్కడా అమలు కాలేదని విమర్శించారు.

వేద న్యూస్

గురువారం జూన్ 19, 2025

# యాదవులకు మంత్రి పదవి ఇవ్వాలి

■ బీసీ జన సభ రాష్ట్ర అధ్యక్షులు డి.రాజారాం యాదవ్



**వేద న్యూస్, నర్సంపేట :**

దేశ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించడమే కాకుండా, రాష్ట్రంలో అత్యధిక జనాభా ఉన్న యాదవ జాతికి కేబినెట్ లో చోటు లేకపోవడం సిగ్గుచేటని రాజారాం యాదవ్ అన్నారు. బుధవారం నర్సంపేట మాదన్నపేట రోడ్డులో యాదవ సంఘం కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి యాదవ సంఘాల జాక్ నర్సంపేట నియోజకవర్గ బాధ్యులు బీసీ ప్రజాసంఘాల రాష్ట్ర నాయకులు ఆబోతు రాజు యాదవ్ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. సభ అధ్యక్షులు ఆబోతు రాజు యాదవ్.. యాదవులు ఆర్థికంగా రాజకీయంగా అభివృద్ధి చెందుకుంటూనే బీసీలకు అండగా నిలవాలని అన్నారు. ఈ కార్యక్రమ ముఖ్య అతిథులు బీసీ జన సభ రాష్ట్ర అధ్యక్షులు రాజారాం యాదవ్, అఖిల భారత యాదవ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లొడంగి గోవర్ధన్ యాదవ్, తెలంగాణ యాదవ జర్నలిస్టు ఫోరం రాష్ట్ర అధ్యక్షులు మేకల కృష్ణ యాదవ్, అఖిల భారత యాదవ మహాసభ జనగాం జిల్లా అధ్యక్షులు బిసి కులాల ఐక్యవేదిక రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బనుక సిద్దిరాజ్ యాదవ్ పాల్గొన్నారు. ఈనెల 30న హైదరాబాదులో జరిగే యాదవుల ఆత్మగౌరవ సభకు భారీసంఖ్యలో రావాలని పిలుపునిచ్చారు. అనంతరం రాజారాం యాదవ్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యేలు లేరు అనే సాకుతో యాదవ జాతిని వెనకబాటుకు గురిచేయవద్దని, వెంటనే మంత్రి పదవి కేటాయించాలని కోరారు. ప్రతీ జిల్లాలో, నియోజకవర్గంలో యాదవ కులస్తులు ఆవేదనతో ఉన్నారని చెప్పారు. నీతికి, నిజాయితీకి ప్రతీక యాదవ జాతి అని చెప్పే కాంగ్రెస్ పెద్దలు తక్షణమే మంత్రి పదవి ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డి మంచి మనస్సుతో అలోచించి కులానికి పదవి కల్పించాలని విన్నవించారు. ఈనెల 30వ తేదీన యాదవుల ఆత్మగౌరవ సభ ఇందిరా పార్క్ లో నిర్వహిస్తున్నామని, యాదవ బిడ్డలంతా తరలివచ్చి సభను విజయవంతం చేయాలని పిలుపునించారు.

**ప్రభుత్వానికి కనువిప్పు కలిగేలా:**

**లొడంగి గోవర్ధన్ యాదవ్**

యాదవ జేఏసీ ఆధ్వర్యంలో జూన్ 30న ఇందిరా పార్క్ లో యాదవ ఆత్మగౌరవ సభ నిర్వహిస్తున్నామని లొడంగి గోవర్ధన్ యాదవ్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి కనివిప్పు కలిగేలా ఈ సభ ఉండబోతోందని పేర్కొన్నారు. సభను విజవంతం చేయడానికి ఉమ్మడి వరంగల్ జిల్లా యాదవులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రంలో యాదవులకు మంత్రి పదవి లేకపోవడం దుర్మార్గపు చర్య అని అభివర్ణించారు.

హిందూ జాతికి భగవద్గీతను అందించిన జాతి యాదవ జాతి అని, తెలంగాణలో గోల్కొండను నిర్మించిన చరిత్ర యాదవ జాతిదని గుర్తు చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం మళ్లీ నింపబోయే కేబినెట్ పదవుల్లో యాదవ జాతికి పెద్ద పీట వేయాలని కోరారు. అలాగే జనాభా ధమాషా పద్దతిలో యాదవులకు రావాల్సిన నామినేటెడ్ పదవులు ఇవ్వాలన్నారు. గతంలో బీఆర్ఎస్ హయాంలో జరిపిన సమగ్ర కుటంబ సర్వేలో ముస్లింలు లేకుండా బీసీలు 52శాతం ఉన్నారని, కానీ ఇప్పుడు ముస్లింలను కలుపుకొని 56శాతం బీసీలు ఉన్నారు అని చెప్పడం సిగ్గుచేటన్నారు. కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం 42శాతం స్థానిక సంస్థల్లో బీసీలకు అవకాశం కల్పించాలని కోరారు. యాదవులు, మున్నూరుకాపులు లేని మంత్రి మండలి ఉండటం బాధాకరమని పేర్కొన్నారు. కాంగ్రెస్ కు మున్నూరుకాపులు కే కేశవరావు, డీఏస్ లాంటి వారు ఎన్నో సేవాలు చేశారని చెప్పారు. బీసీలకు మంత్రి మండలిలో సమూచిత స్థానం కల్పించాలని బీసీ కులాల లెక్కన 9 మందికి చోటు కల్పించాలని కోరారు. యాదవులు ఎన్నో రోజులుగా ఎదురు చూస్తున్న రెండో విడత గొర్రెల పంపిణీని వెంటనే చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం మేకల కృష్ణ యాదవ్ మాట్లాడుతూ.. చరిత్రలో యాదవులు లేకుండా మంత్రి మండలి లేదని, యాదవ మంత్రి లేకుండా పాలన చేస్తున్న ఏకైక సీఎం రేవంత్ రెడ్డి అని ఎద్దేవా చేశారు. యాదవులను మరిచిపోతే కచ్చితంగా తగిన మూల్యం చెల్లిస్తారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మా సత్తా చాటుతామని హెచ్చరించారు. కొమ్మనబోయిన వేణు యాదవ్ మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలకు మొదటి అడుగు వేసి ఓట్లు వేసింది యాదవ జాతి బిడ్డలేనని గుర్తు చేశారు. యాదవులకు మంత్రి పదవి ఇవ్వకపోవడంలో కాంగ్రెస్ ఉద్దేశం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గోవర్ధన్ యాదవ్, మేకల కృష్ణ యాదవ్, సిద్దిరాజు యాదవ్, ఆబోతు రాజు యాదవ్, కొమ్మనబోయిన వేణు యాదవ్, ఆబోతు అశోక్ యాదవ్, గజ్జి కొమురెల్లి యాదవ్, లింగన్న యాదవ్ ఆబోతు రాజ్ కుమార్ యాదవ్, బూడిద ముఖేష్ యాదవ్, బండి పర్వతాలు యాదవ్,సతీష్ యాదవ్, రాజు యాదవ్, బీరం శ్రీకాంత్ యాదవ్, అక్షయ్ యాదవ్ పాల్గొన్నారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి


■ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్

**వేద న్యూస్, వరంగల్ టౌన్:**



ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అన్నారు. బుధవారం నగర పరిధి లోని 45,46 డివిజన్ లోని కడిపికొండ, రామన్న పేట ప్రాంతాల్లో కమిషనర్ క్షేత్ర స్థాయి లో సందర్శించి వందరోజుల కార్యచరణ ప్రణాళికలో భాగంగా నిర్వహించిన అవగాహన ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ 45వ డివిజన్ లో డీసిల్టింగ్ ప్రక్రియను పరిశీలించారు. అనంతరం తడి,పొడి చెత్తను వేరు చేసి స్వచ్ఛ ఆటో కు అందజేయాలని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరుతూ నిర్వహించిన అవగాహన ర్యాలీలో కమిషనర్ పాల్గొని సీజనల్ వ్యాధులు ప్రబలకుండా, దోమలు వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల కు సంబంధించిన అవగాహన పై ముద్రించిన కరపత్రాలను స్థానికులకు అందజేసి గృహాలకు స్టికర్ లను అంటించారు. శానిటేషన్ సిబ్బంది తో మాట్లాడిన కమిషనర్ అటెండెన్స్ రిజిస్టర్ ను పరిశీలించి విధి నిర్వహణ తీరును సిబ్బందిని అడిగి తెలుసుకొని తగు సూచనలు చేశారు. ప్రధాన రహదారులతో పాటు అప్రోచ్ రోడ్లను శుభ్రంగా ఉంచాలని ప్రజల నుండి ఏలాంటి ఫిర్యాదులు రాకుండా సందుల్లోకి వెళ్లి చెత్త సేకరణ జరపాలని ముందస్తు సమాచారం ఇవ్వకుండా గైర్హాజరూ కాకూడదని సూచించారు. డంప్ యార్డ్ ను క్షేత్ర స్థాయిలో సందర్శించి బయో మైనింగ్ నిర్వహణ విధానాన్ని అడిగి తెలుసుకున్నారు.ఈసందర్భం గా నిర్వాహకులు చెత్తను ప్రాసెసింగ్ పూర్తి చేయడం జరిగిందని వారం రోజుల్లో డిస్పోస్ చేసి అందజేస్తామని తెలియజేశారు. వేవయింగ్ మిషన్ (బరువు తూచే యంత్రం)పని తీరు ను కమిషనర్ పరిశీలించారు. రామన్నపేట ప్రాంతంలో గ్రేవీ యార్డును పరిశీలించిన కమిషనర్ గేటును ఏర్పాటు చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భం గా నీటి నాణ్యత నిర్ధారణ లో భాగం గా క్లోరినేషన్ ప్రక్రియను పరిశీలించారు. డంప్ యార్డ్ ప్రాంతం లో బయో గ్యాస్ ప్లాంట్ ఏర్పాటు చేయుటకు సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిఎంహెచ్ఓ డా. రాజారెడ్డి, వెటర్నరీ వైద్యులు డా.గోపాల్ రావు, ఈఈ సంతోష్ బాబు, ఏ ఈ రామన్న, సానిటరీ ఇన్స్పెక్టర్లు వెంకన్న, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన రెవెన్యూ సదస్సులు



**వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి :**

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూభారతి చట్టం రెవిన్యూ సదస్సులో భాగంగా వేములపల్లి మండలం ప్రశాంతంగా ముగిసిందని వేములపల్లి తహసిల్దార్ హేమలత పేర్కొన్నారు. భూ భారతి చట్టంతో రైతులకు న్యాయమైన సేవలు అందుతాయని అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని చలిచీమలపాలెం గ్రామంలో రెవిన్యూ సదస్సును నిర్వహించి ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల నుండి జూన్ 20 దరఖాస్తులను స్వీకరిస్తామని చెప్పారు. ఇప్పటివరకు మండల వ్యాప్తంగా 1099 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. మండల వ్యాప్తంగా పలు గ్రామాల నుండి 800 పి ఓ టి దరఖాస్తులు,సాదా బైనామి దరఖాస్తులు వచ్చాయని అన్నారు.299 ఇతరత్రా దరఖాస్తులు వచ్చాయని వివరించారు.రైతుల నుండి స్వీకరించిన దరఖాస్తులను కంప్యూటర్లో అప్లోడ్ చేస్తామని పేర్కొన్నారు. మండల వ్యాప్తంగా ఇంకా ఎవరైనా భూ సమస్యలు ఉంటే ఈ నెల 20 వరకు తహసిల్దార్ కార్యాలయంలో సమర్పించుకోవచ్చని స్పష్టం చేశారు. ఈ రెవెన్యూ సదస్సులో స్వీకరించిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి న్యాయం చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ కోటేశ్వరి, ఆర్ ఐ లు మహేందర్ రెడ్డి రెడ్డి, స్పందన రెడ్డి, కంప్యూటర్ ఆపరేటర్లు హర్ష, గణేష్, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ

**వేద న్యూస్, నల్లబెల్లి :**



నల్లబెల్లి మండలంలోని కొండాపూర్ ప్రభుత్వ ప్రాథమికొన్నత పాఠశాలలో ని ఉపాధ్యాయులు కందకట్ల నాగరాజు, బానోతు కృష్ణ 5000 రూపాయల విలువగల చుచిరాత కాపీలు, చెక్ రూల్ కాపీలు విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మేడపెల్లి కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు కృష్ణమూర్తి, పిఆర్టి యు మండల అధ్యక్షుడు నక్కిరెడ్డి మహేందర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పోగుల కైలాసం, కుమారస్వామి, పాఠశాల ఉపాధ్యాయ బృందం వెంకటేశ్వర్లు, ప్రవీణ్, అనూష, అనిత, మనోజ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా జెఎస్ఆర్ ఈ వెహికిల్స్ కార్పొరేట్ ఆఫీస్ ప్రారంభోత్సవం

**వేద న్యూస్, సూర్యాపేట ప్రతినిధి:**



హైదరాబాద్ మహానగరం లోని ఉప్పల్ భగయత్ లో జెఎస్ఆర్ ఈ వెహికల్స్ కన్స్యూమర్స్ సర్వీస్ ప్రైవేట్ లిమిటెడ్ వారి ఎలక్ట్రిక్ వెహికల్స్ కార్పొరేట్ ఆఫీసును ఘనంగా ప్రారంభోత్సవం చేయడం జరిగింది. ఈ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా స్థానిక ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి పాల్గొని ప్రారంభించి మాట్లాడుతూ ప్రపంచం అత్యాధునిక టెక్నాలజీతో అంచలంచెలుగా అభివృద్ధి చెందుతున్న తరుణంలో కేవలం చార్జింగ్ తో నడిచే స్కూటీలు వాహనాలను అదునాతన సౌకర్యాలతో హైదరాబాద్ మహానగరంలో కూడా ప్రజలకు అందుబాటులో తెచ్చే విధంగా షో రూమ్ లో అతి తక్కువ ధరకు నాణ్యమైన ఈ వెహికల్స్ అందుబాటు ఉన్నాయని ఈ కార్పొరేట్ ఆఫీసులో సంప్రదించి వీటిని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జె ఎస్ ఆర్ సన్ సిటీ నారాయణ, బిఆర్ఎస్ ఎక్స్ రెడ్కో చైర్మన్ సోషల్ మీడియా ఇన్చార్జ్ వై. సతీష్ రెడ్డి, కార్పొరేట్ ఆల్ ఇండియా గౌడ్స్ అసోసియేషన్ స్టేట్ ప్రెసిడెంట్. వేములయ్య గౌడ్, మేనేజింగ్ డైరెక్టర్స్ నకిరేకంటి సైదులు, భయ్యా కిరణ్ కుమార్, నక్క రాజు, తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలి

**వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి :**



మిర్యాలగూడ పట్టణంలోని స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బుధవారం పబ్లిక్ హెల్త్ మరియు మున్సిపల్ అధికారులు, మిషన్ భగీరథ అధికారులతో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు.అమృత స్కీం ద్వారా పట్టణంలో చేపట్టిన పలు అభివృద్ధి పనుల పైన అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీఎల్ఆర్ మాట్లాడుతూ పట్టణంలో పారే నీటి నిల్వ లో సమస్యలు,కాలువలలో జమయ్యే చెత్త లాంటి సమస్యల నివారణకు అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ వ్యవస్థ కీలకమైందని తెలిపారు. అభివృద్ధి పనుల్లో పారదర్శకత,వేగం,నాణ్యత ఉండాలన్నారు.అవసరమైతే మానిటరింగ్ మెకానిజాన్ని మరింత బలోపేతం చేయాలని సూచించారు. గత పాలకుల నిర్లక్ష్యం అధికారుల పర్యవేక్షణ లోపంతో ముందుచూపు లేకుండా రహదారి మధ్యలో ఉన్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ మ్యాన్ హెూల్ మూతలను మూసేస్తూ రోడ్డు నిర్మాణం చేపట్టడంతో మ్యాన్ హెూల్స్ ఎక్కడున్నాయో తెలియక చిన్న వర్షానికే డ్రైనేజీలు పుడుకుపోయి నీరు అంత రోడ్లపై పారుతుంది అన్నారు.

## ఆకతాయిలను పట్టుకున్న షీ టీం బృందం

**వేద న్యూస్, వరంగల్ క్రైమ్:**



హనుమకొండలోని చిల్డ్రన్ పార్కు ఏరియాలో మహిళల పట్ల ఆకతాయిలు ఇబ్బందులు పెడుతున్నరనే విషయాన్ని తెలుసుకున్న షీ టీం బృందం బుధవారం సాయంత్రం సమయంలో రెక్కీ నిర్వహించి 20 మంది ఆకతాయిలను పట్టుకొని తమదైన శైలిలో కౌన్సిలింగ్ ఇవ్వడం జరిగింది. ఇదే విషయంపై రెక్కీ నిర్వహించి ఆకతాయిలకు పట్టుకొని కౌన్సిలింగ్ ఇచ్చిన షీ టీం ఇన్స్పెక్టర్ సుజాత మాట్లాడుతూ మహిళలకు రక్షణ కోసం షీ టీం బృందం పనిచేస్తుందని ఎలాంటి సమయాల్లో అయినా మహిళలపై అసభ్యకరంగా ప్రవర్తించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఏమైనా సమాచారం ఇవ్వాలనుకుంటే ఈ క్రింది నెంబర్లకు ఫోన్ చేయగలరని 8712685257, 8712685142, 8712685270 తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ కంచి విద్యాసాగర్, హెడ్ కానిస్టేబుల్ సూర్యనారాయణ,యాదగిరి, కానిస్టేబుల్స్ వంశీకృష్ణ, రాంరెడ్డి, మహిళా కానిస్టేబుల్ పూర్ణ, సువార్త తదితరులు పాల్గొన్నారు.



## ల్యాదెల్లలో జానపద పాట చిత్రీకరణ

**వేద న్యూస్, హన్మకొండ :**

గ్రేటర్ వరంగల్ నగరం పరిధిలోని ల్యాదెల్లలో బుధవారం "సోలాపురం పోయినను" అనే జానపద పాటను చిత్రీకరించారు. 'ఫ్లై ఆన్ రీల్స్' యూ ట్యూబ్ ఛానల్ నిర్మిస్తున్న ఈ పాటలో చిత్రీకరణలో నటి నటులుగా భ్రమరాంబికా, ఈశ్వర్ సాయి చేశారు.కాగా శేఖర్ వైరస్ కొరియోగ్రాఫర్ గా వ్యవహరించారు. ఈ సందర్భంగా ఫ్లై ఆన్ రీల్స్' ఫౌండర్స్ ఎన్. వినీత్, ఎల్. కృష్ణ, బి.శ్యామ్ సుందర్ లు మాట్లాడుతూ.. భార్య, భర్త మధ్య జరిగే సరసాలతో జానపద పాటను చిత్రీకరించినట్లు తెలిపారు. పాట చిత్రీకరణ సమయంలో సహకరించిన ల్యాదెల్ల గ్రామ ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



## అమ్మ మాట.. అంగన్వాడీ బడిబాట

**వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి :**

ఐదేళ్లలోపు చిన్నారులను అంగన్వాడీలో చేర్పించి వారి భవిష్యత్తుకు పునాదులు వేయాలని ఆమనగల్లు అంగన్వాడి కేంద్రము 1 టీచర్ వల్లంపట్ల కాంతమ్మ అన్నారు. బుధవారం వేములపల్లి మండల కేంద్రంలోని ఆమనగల్లు అంగన్వాడి 1 కేంద్రంలో అమ్మబాట అంగన్వాడి బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం చేపట్టారు. ఈ సందర్భంగా పలకల మీద అ ఆ లు దిద్దుకుంటూ..ఆట బొమ్మలను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం చిన్నారులకు అంగన్వాడీల ద్వారా పౌష్టికాహారం అందజేస్తుందన్నారు. ఈ కార్యక్ర మంలో అంగన్వాడి ఆయమ్మ సంధ్య, ఆశ వర్కర్లు సుందరమ్మ, అన్నపూర్ణ పిల్లల తల్లిదండ్రులు,గర్భిణీలు,బాలింతలు, గర్భిణీలు పాల్గొన్నారు.

## బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన అందరి బాధ్యత

■ కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**వేద న్యూస్, వరంగల్ :**

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన ప్రతిఒక్కరి బాధ్యత అని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, జిల్లా టాస్క్ఫోర్స్ సమావేశం కలెక్టరేట్లో బుధవారం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థుల డ్రాప్ అవుట్స్పై దృష్టి సారించాలన్నారు. ఇటుకల పరిశ్రమ, బీడి, చిన్నతరహా పరిశ్రమలు, దుకాణాలు తనిఖీచేసి బాల కార్మికులను గుర్తించాలన్నారు. హార్వెస్టింగ్ పనుల్లో తనిఖీ నిర్వహించాలని సూచించారు. బాల కార్మికుల చట్టం, 1986, జేజే చట్టం మరియు భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), 2023 కింద బాల కార్మికులను నియమించిన యజమానులపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. బాల కార్మికుల నిర్మూలనకు కార్యాచరణ ప్రణాళికను అమలు చేయాలని కమిటీ సభ్యులను ఆదేశించారు. కార్మిక శాఖ ఉప కమిషనర్ నారాయణ స్వామి, డిఆర్డీఓ కౌసల్యాదేవి, డీఈఓ జ్ఞానేశ్వర్, సంబంధిత శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ కాలేజీల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలి

**వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి :**

ప్రైవేట్ జూనియర్ కాలేజీలు ఇష్టారీతిన ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థులను అడ్డగోలుగా దోచుకుంటున్నాయని,రాష్ట్ర ప్రభుత్వమే ఇంటర్ కాలేజీల ఫీజులను నిర్ణయించాలని బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ పేర్కొన్నారు.ఈ సందర్భంగా బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. కాలేజీల్లో ఫీజులు 60 శాతం కడితేనే విద్యార్థులకు ఐడి వస్తుందని చెప్పి కనీస వాయిదాలలో చెల్లించే అవకాశం ఇవ్వకుండా తల్లిదండ్రులను బెదిరింపులకు గురి చేస్తున్నారని పేర్కొన్నారు. ఒక్క కాలేజీకి మాత్రమే అనుమతి తీసుకుని పది కాలేజీలు నడుపుతున్న ఇంటర్మీడియట్ అధికారులు నిద్ర మత్తులో ఉండి పట్టించుకోవడం లేదన్నారు.

## విద్యార్థులకు మధ్యాహ్న భోజన ప్లేట్లు, రాగి గ్లాసులు, నోటు పుస్తకాల ఉచిత పంపిణీ

**వేద న్యూస్, నల్లబెల్లి :**

నల్లబెల్లి మండలం నాగరాజుపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని పంతులుపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యా ర్థులకు, హన్మకొండకు చెందిన దివంగత పోలీసు కానిస్టేబుల్ అడ్డూరి రాజ నరేందర్ జయంతి సందర్భంగా మధ్యాహ్న భోజన ప్లేట్లు రాగి గ్లాసులు, 3 వేల రూపాయల విలువైన నోటుబుక్కులు, పెన్నులు, పెన్సిల్లు తదితర స్టేషనరీ అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కర్ణకంటి రామ్మూర్తి అధ్యక్షతన ఏర్పాటుచేసిన సమావేశంలో నల్లబెల్లి మండల విద్యాశాఖ అధికారిణి ఎం.అనురాధ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక పాఠశాల అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ ఎరుకల వెంకటలక్ష్మి, గ్రామ తాజా మాజీ సర్పంచ్ గోనె శ్రీదేవి, పాఠశాల సహోపాధ్యాయులు కూనమల్ల రాజన్ బాబు, సిఆర్పీ వైనాల రవి మరియు విద్యార్థులు పాల్గొన్నారు.



Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073